జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 19 ఫిబ్రవరి 2024
13
www.ntnews.com

# వరాహ రూపం.. దైవ వరిష్ఠం!

**అసురత్వం సవాలు విసిరింది. నేలతల్లిని సమూలంగా నీట ముంచింది. 'తనను ఎదుర్కొనే వీరుడు ఎవరు?' అని విర్రవీగుతున్న రాక్షసత్వానికి విరుగుడు ఆ క్షణమే ప్రభవించింది. అహంకారంతో అవనిని ఆగం పట్టించిన వాడిని భీకర రూపంతో గదమాయించింది. ధరణిని నిలిపి, దుష్ట హిరణ్యాక్షుణ్ని తన కరాళ దంష్ట్రలతో కుళ్లగించిన రణ హుంకారం... ఆదివరాహ అవతారం.**

'వసతి దశన శిఖరే ధరణీ తవ లగ్నా శశిని కళంకకలేవ నిమగ్నా కేశవ ధృత శూకరరూప జయ జగదీశ హరే!' అని వైష్ణవ వాగ్గేయకారులలో ప్రముఖులైన శ్రీ జయదేవ గోస్వామి దశావతార స్తోత్రంలో వరాహ అవతారాన్ని కీర్తించారు. 'శూకర రూపాన్ని ధరించిన ఓ కేశవా! ఓ జగదీశా! ఓ హరి! నీకు జయము జయము. గర్భోదక సముద్రములో మునిగి విశ్వపు అడుగు భాగానికి చేరిన ధరణి.. చంద్రుడిపై మచ్చలా నీ కొమ్ముదంతం అంచులో నిలబడి ఉన్నది' అని వర్ణించారు.

ఇంతకీ విష్ణుమూర్తి వరాహ రూపాన్ని ఎందుకు ధరించాల్సి వచ్చింది? ఇవన్నీ ఊహాత్మక, ఉపమాన కథలుగా భావిస్తుంటారు. కొందరు వాటికి ఎలాంటి ఆధారాలూ లేవని, కాల్పనికాలనీ చెబుతుంటారు. కానీ, శ్రీమద్భాగవతం, ప్రామాణిక పూర్వాచార్యులు భగవంతుని అవతారాలను ఊహాత్మకంగా ఎన్నడూ పేర్కొనలేదు. అంతర్జాతీయ హరే కృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదుల వారు ఇదే విషయంపై స్పందిస్తూ.. 'వరాహ' రూపాన్ని ఎందుకు స్వీకరించాడో ఇలా వివరించారు.. 'శ్రీ కృష్ణుడు వరాహమూర్తిగా అవతరించినంత మాత్రాన... వారు కష్టాలు అనుభవిస్తున్నారని అర్థం కాదు. వారికి ప్రతీదీ ఆనంద-చిన్మయ-రస-ప్రతిభావితాభిః' (బ్రహ్మ సంహిత 5.37). కొన్నిసార్లు ఎంతో పెద్ద మనిషి కూడా గుర్రంగా మారుతుంటాడు. దీనిపై బ్రిటన్ ప్రధానమంత్రి గ్లాడ్‌స్టన్‌కు సంబంధించిన ఆసక్తికరమైన కథనం ఒకటుంది.. అవును! ఒకసారి గ్లాడ్‌స్టన్ ఇంటర్వ్యూ కోసం ఒకరు వచ్చారు. అక్కడున్న సేవకుడు 'ప్రధాని ఇప్పుడు తీరిక లేకుండా ఉన్నారు. వేచి ఉండండి' అన్నారు. గంట గడిచిపోయింది. ఇంకా ఎలాంటి సమాచారమూ రాలేదు. ఇంటర్వ్యూకి వచ్చిన వ్యక్తి ఇంతసేపు ప్రధాని లోపల ఏం చేస్తున్నారో అనే కుతూహలం కొద్దీ తలుపు కొద్దిగా తెరిచి చూశారు. ఆ గదిలో ప్రధాని తన మనవడిని వీపు ఎక్కించుకొని గుర్రం ఆట ఆడటం చూసి అవాక్కయ్యాడు. ప్రధాని గుర్రం కాకపోయినా.. తన మనవడి కోసం అలా మారారు. అదేవిధంగా 'కేశవ ధృత శూకర రూప'- అంటే భగవంతుడు కూడా ఒక సాధారణ వరాహం అని కాదు భావం! తన ఆనందం కోసం, జగత్తును రక్షించడం కోసం వరాహ రూపుడై అవతరించాడు.


బుధవారం వరాహ ద్వాదశి

భగవంతునివి కేవలం దశావతారాలు మాత్రమే కాదంటారు శ్రీల ప్రభుపాదులు. 'భగవంతునికి వేలాది అవతారాలున్నాయి. 'అద్వైతం అచ్యుతం అనాదిం అనంతరూపమ్' (బ్రహ్మ సంహిత 5.33). ఎలాగైతే మనం ఒక నదిలోని తరంగాలను లెక్కించలేమో.. భగవంతుడి అవతారాలను కూడా అంచనావేయలేం. అవి నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి. అవి నిత్య నూతనం, అనేకం. ఆ పరమపావన విష్ణు లీలలను శ్రవణం చేయడమే మానవ జన్మకు పరిపూర్ణత' అంటారు ప్రభుపాదులు.

'సృష్టి ఆరంభం నుంచి దేవతలు, దైత్యులు విశ్వంలోని లోకాలన్నిటినీ శాసించేవారు. విశ్వంలోని దేవతల్లో బ్రహ్మ ప్రథముడైతే, దైత్యుల్లో హిరణ్యాక్షుడు మొదటివాడు. భగవంతుడు ఏర్పరచిన సృష్టిలో కొన్ని నిర్దిష్ట నియమాల అనుసారమే వివిధ లోకాల్లోని గ్రహాలన్నీ అంతరిక్షంలో తేలాడుతున్నాయి. వాటి అంతర్నిర్మాణమే ఇందుకు కారణం. విశ్వంలోని సగ భాగం గర్భోదక జలాలతో నిండి ఉంటే, మిగిలిన సగం అసంఖ్యాకమైన గ్రహాలతో కూడి, లోకాలతో నిండి ఉన్నది. హిరణ్యాక్షుడు ఈ గ్రహాల కక్ష్య క్రమానికి విఘాతం ఏర్పర్చడంతో భూమి భారరహిత స్థితిని కోల్పోయి జలాల్లో పతనమైంది. ఆ సమయంలో జగత్తుకు స్థితికారుడైన భగవంతుడు శూకర రూపాన్ని ధరించి ఆవిర్భవించాడు. తన కొమ్ము దంతాలతో గర్భోదక జలంలోని భూమండలాన్ని ఎత్తి తిరిగి నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టాడు. ఆ సమయంలో తనను అడ్డగించిన హిరణ్యాక్షుణ్ని కొమ్ముదంతంతో గుచ్చి సంహరించాడు' అని వివరించారు శ్రీల ప్రభుపాదులు.

భగవంతుని అవతార విశేషం ఇలాగే ఉంటుంది! అసాధారణ పరిస్థితుల్లో ఆయన అనువైన రూపంతో అవతరిస్తాడు. మనుష్యుని చింతనకు అందని పరమాద్భుత రీతిలో తన లీలలను ప్రదర్శిస్తాడు. ఆ లీలలను మళ్లీ మళ్లీ అంకితభావంతో శ్రవణం చేయడం ద్వారా భగవంతుని సాకార తత్వాన్ని తెలుసుకోగలం. మనం స్థిరచిత్తులై ఉండగలం. అలాంటి వైవిధ్య భరితమైన శ్రీకృష్ణుడి లీలల్లో పాలుపంచుకుంటే సకలం ఆనందమయం అవుతుంది. అదే జీవితానికి సార్థకత.

ప్రస్తుత కలియుగంలో భగవంతుడు ఈ లోకంలో అవతరించాడు! తన పవిత్ర నామ రూపంలో మన చెంతకు వచ్చాడు. 'కలి కాలే నామ రూప కృష్ణ అవతార' అని పరంపరాచార్యులైన శ్రీల ప్రభుపాదుల వారు పవిత్ర నామాలతో కూడిన 'హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే। హరేరామ హరేరామ రామ రామ హరే హరే॥' మహామంత్రాన్ని ఉపదేశించారు. ఎవరైతే ఈ మంత్రాన్ని ఏకాగ్రతతో వింటూ జపిస్తారో, వారు ఈ జన్మలోనే శ్రీహరి ప్రత్యక్షానుభూతిని పొందగలరు. ఆ భగవానుడు గరుడ వాహనంపై తరలివచ్చి భక్తులను భవసాగరం నుంచి రక్షిస్తాడు. అందుకే కృష్ణ చైతన్యవంతులమై వారి సేవలో తరించడమే మనం చేయాల్సింది. వివేకవంతుడైన వాడు భక్తి మార్గాన్ని అనుసరిస్తాడు. ముక్తి పథంలో పయనిస్తాడు. జీవన్ముక్తి పొందుతాడు.

... శ్రీమాన్ సత్యగౌరచంద్రదాస ప్రభూజి
93969 56984



**జీవ పరిణామ క్రమం కోతి నుంచి మనిషి దగ్గర ఆగిపోయిందని డార్విన్ సిద్ధాంతం. మనిషి దైవంగా మారడమే నిజమైన జీవ పరిణామ క్రమంగా సనాతన రుషులు అభివర్ణించారు. మానవుడిగా జన్మించి దైవత్వాన్ని పొందిన వారు ఎందరో పురాణాల్లో కనిపిస్తారు. చరిత్రలో వెదికితే.. సామాన్య మనుషులుగా పుట్టి దైవత్వాన్ని పొందిన సమ్మక్క, సారలమ్మ కథ కనిపిస్తుంది. వనసీమలో వెలసిన ఈ తల్లీకూతుళ్లు.. నమ్ముకున్న వారి కోసం నడుం బిగించారు. దురహంకారాన్ని దునుమాడారు. అయిన వారి కోసం అసువులు బాసి దేవతలయ్యారు. మేడారం జాతరకు వేల్పులుగా నిలిచారు. పసుపు, కుంకుమల రూపంలో నేటికీ అనుగ్రహిస్తున్నారు. బంగారంతో వచ్చి శరణు జొచ్చినవారికి బంగారు భవిష్యత్తును ప్రసాదిస్తున్నారు. జాతర వేళ ఈ వనదేవతల త్యాగాన్ని మరోసారి స్మరించుకుందాం..**

# అడవి బిడ్డలే.. అందరి తల్లులై!

**ఈ నెల 21-24 మేడారం జాతర**

నమ్ముకున్న వాళ్ల కోసం ప్రాణార్పణం చేసిన వారిని దేవతలుగా కొలిచే పండుగ మేడారం జాతర. గిరిజనులగా పుట్టి, పెరిగి, వారి కోసమే పోరాడిన సమ్మక్క, సారలమ్మ ఆదివాసీలకు దేవతలు అయ్యారు. కాలక్రమంలో అందరికీ అమ్మలయ్యారు. మనుషులే దేవతలుగా మారిన వైనం జాతరకు కారణం. ఇక్కడ నమ్మకాలే పూజలు. ఆచారాలే ఆరాధనలు. దేవతలు గద్దెల పైకి రావడం ఓ ఉత్సవం. అమ్మలు వచ్చిన వేళ.. జాతరకు పూనకం పుడుతుంది. భక్తితో ఊగిపోతుంది. పారవశ్యంతో పొంగిపోతుంది. టన్నులకొద్దీ బంగారం (బెల్లం) మొక్కులు, రాసుల కొద్దీ కాసుల వర్షం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేండ్ల పండుగకు ముస్తాబైంది. పక్షం రోజుల ముందు నుంచే.. భక్తుల కోలాహలం మొదలైంది. నాలుగు రోజుల పాటూ జరిగే అసలు జాతర తెలంగాణ సంస్కృతికి సిసలైన నిర్వచనం చెబుతుంది.



**జాతరలో** భాగంగా మొదటి రోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకువస్తారు. సారలమ్మ గద్దె పైకి రాకముందే ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కొండాయి నుంచి గోవిందరాజును, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును అటవీమార్గం మీదుగా కాలినడకన మేడారం తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. రెండో రోజు సాయంత్రం వడ్డెలు (పూజారులు) మేడారంలోని చిలుకల గుట్ట పైకి వెళ్లి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకు వచ్చి మేడారం గద్దెపై ప్రతిష్ఠిస్తారు. సమ్మక్క రాకతో మేడారం పులకించిపోతుంది. మూడోరోజు గద్దెలపై సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు ఉంటారు. ఇద్దరు అమ్మలున్న నాడు మేడారం భక్తులతో కిక్కిరిసిపోతుంది. నాలుగోరోజు సమ్మక్కను చిలుకలగుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి, గోవిందరాజును కొండాయికి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు కాలినడకన తీసుకెళ్తారు. దేవతలు వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

**మేడారం** జాతర గిరిజన సంప్రదాయం ప్రకారం జరుగుతుంది. సమ్మక్క, సారలమ్మలకు ఎలాంటి విగ్రహాలు ఉండవు. రెండు గద్దెలు ఉంటాయి. ఒకటి సమ్మక్క గద్దె, మరొకటి సారలమ్మ గద్దె. ప్రతి గద్దె మధ్యలో ఉండే చెట్టు కాండాలే (కంకమొదళ్లు) వన దేవతలు. దేవతామూర్తులను తోడ్కొని వచ్చే వడ్డెలు (పూజారులు)... తమ పైనుంచి దాటుకుంటూ వెళితే జన్మ సార్థకమవుతుందని భక్తుల నమ్మకం. సమ్మక్క కుమారుడి పేరుతో ఉన్న జంపన్న వాగులో స్నానం చేసిన తర్వాత గద్దెల దగ్గరికి పోయి అమ్మలను దర్శించుకుంటారు. చాలా మంది మగవాళ్లు అమ్మవారి రూపం(మహిళగా)లో మొహానికి పసుపు పూసుకుని పెద్దబొట్టు పెట్టుకుని వచ్చి వన దేవతలను దర్శించుకుంటారు. కంకబియ్యం (ఒడి బియ్యం), ఎదురుకోళ్లు (దేవతను తీసుకు వచ్చేటప్పుడు ఎదురుగా కోళ్లను గాల్లోకి ఎగురవేయడం), లసిందేవమ్మ మొక్కు (గుర్రం ఆకారపు తొడుగును మొహానికి కట్టుకుని వచ్చి దాన్ని అమ్మవారికి సమర్పించడం) వంటి మొక్కులు ఇక్కడ ఉంటాయి. సమ్మక్క-సారలమ్మలను దర్శించుకునే భక్తులు వనదేవతలకు మొక్కుగా వారి బరువుకు సమానంగా బంగారం (బెల్లం) సమర్పించుకుంటారు. మేడారం జాతరలో బెల్లమే ప్రసాదం. కోటి మంది వరకు వచ్చే జాతర ప్రాంతం దుమ్ముధూళితో నిండిపోతుంది. ఆరోగ్య సమస్యలు... ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు రాకుండా బెల్లం పనిచేస్తుంది. అందుకే ఇక్కడ బెల్లాన్ని ప్రసాదంగా పెట్టారని గిరిజనులు చెబుతుంటారు. మేడారం జాతర ఆదివాసీలదే. వీరంతా పేదలే కాబట్టి ఇక్కడ కానుకల మొక్కుల సంప్రదాయం లేదు. ఇది అచ్చమైన గిరిజన జాతర. మద్యం, మాంసం ఈ జాతరలో మమేకం. జాతరకు వచ్చే భక్తులకు శుద్ధి, నియమాలు ఉండవు. త్యాగాల తల్లులను కొలిచే మేడారం జాతరకు ప్రతి మహిళా రావచ్చు. అంటు, ముట్టు అనే పదాలు ఇక్కడ చెల్లవు.

... పిన్నింటి గోపాల్

# సిందూరం ఎందుకు ప్రీతి?

**ధర్మ సందేహం**



**ఆంజనేయుడికి చందనం (సిందూరం)తో పూజిస్తే మంచిదంటారు! కారణం తెలియజేయగలరు?**
**- రమ్య, నల్లగొండ**

సిందూరం ఆంజనేయుడికి ప్రీతిపాత్రం కావడం వెనుక రామాయణ గాథలో ఒక ఘట్టాన్ని కారణంగా చెబుతారు. రామరావణ సంగ్రామం జరిగే సమయంలో ఒక సందర్భంలో శ్రీరాముడు... ఆంజనేయుడి భుజాలపై ఎక్కి యుద్ధం చేశాడు. ఆ సమయంలో రావణుడు విసిరిన బాణాలు తరచుగా ఆంజనేయుడికీ తగిలాయి. హనుమ శరీరమంతా రక్తసిక్తమైంది. అయినా ఏమాత్రమూ చలించకుండా దృఢదీక్షతో నిలబడతాడు రాంబంటు. రక్తంతో తడిసి ముద్దయిన హనుమ దేహం 'పూచిన మోదుగచెట్టువలె ఉంద'ని వాల్మీకి మహర్షి వర్ణించారు. ఆనాటి సన్నివేశం హనుమకు ఎంతో ఆనందాన్ని, సంతృప్తినీ కలిగించింది. ఆంజనేయుడికి స్వామికార్యం తప్ప స్వకార్యం లేదు కదా! అందుకే ఈనాటికీ తిరుమల బ్రహ్మోత్సవాలు సహా అన్ని వైష్ణవ ఆలయాల ఉత్సవాల్లో విష్ణుమూర్తికి 'హనుమత్ వాహనం' ఏర్పాటు చేసే సంప్రదాయం కనిపిస్తుంది. ఇక అర్చనలో భాగంగా ఆంజనేయుడికి ఎర్రని సిందూరం అలదినప్పుడు ఆనాడు రామయ్య కోసం శరీరం రక్తసిక్తమైన వేళ తను పొందిన ఆనందం తలపులో మెదిలి హనుమ ఆనందిస్తాడట! వెంటనే భక్తుల పట్ల ప్రసన్నుడు అవుతాడని పెద్దల మాట. ఈ అభిప్రాయంతో ఆంజనేయుడికి సిందూరం పూసే ఆచారం లోకంలో ప్రచారమైంది. అంతేకాదు, ఎర్రని రంగు పరాక్రమానికీ, పవిత్రతకూ, త్యాగానికీ సంకేతం. ఈ గుణాల సమ్మేళనమే హనుమంతుడు. కాబట్టి హనుమత్ అర్చనలో సిందూర పూజ ప్రత్యేకమైనదిగా నిలిచింది.

- శ్రీ

**గీతావాక్యం**

# అతనే మోక్షార్హుడు!

**యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ।**
**సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే॥ (భగవద్గీత 2-15)**

'పురుష శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! సుఖదుఃఖాల్లో సమబుద్ధి కలిగిన ఏ ధీరపురుషుణ్ని ఈ విషయ స్పర్శలు బాధించలేవో అటువంటి వ్యక్తే మోక్షార్హుడు' అంటాడు గీతాచార్యుడు. సుఖాలు, దుఃఖాలు చలింపజేయని స్థితికి వ్యక్తులు ఎదగాలన్న ఈ భావన వెనుక మనిషి ప్రస్థానం దృఢమైన మనసును సాధించే దిశగా ఉండాలన్న సందేశం ఉంది. సాధారణంగా మనిషి సుఖాల్లో సంతోషాన్ని, దుఃఖాల్లో బాధను పొందడం సహజమే! కానీ, మనోనిగ్రహాన్ని సాధించిన ఏ వ్యక్తి అయినా ఈ భావాల నుంచి తనను తాను నిగ్రహించుకోగలడు. అయితే అంతటి నిగ్రహాన్ని సాధించాలన్నప్పుడు అతనిలో అపారమైన మానసిక ధైర్యం, శక్తి అవసరం అవుతాయి. ఆ దిశగా సాగే వ్యక్తి సాధన సాధారణంగా ఉండదు. అది అంత సులభమైనది కూడా కాదు. దానికి ప్రతివ్యక్తి కఠోరంగా శ్రమించాలి. ఆ శ్రమ శారీరకం కాదు, మానసికమై ఉండాలి. అంటే సుఖదుఃఖాలలో కలత చెందకుండా, ఈ ద్వయాన్ని అవ్యయంగా భావించి ప్రవర్తించగలగాలి. అంటే అతనిలో ఏది బ్రహ్మమో తెలుసుకునే అవగాహన సంపూర్ణంగా ఉండాలి. 'ఏతదమృతం ఏతదభయం ఏతద్బ్రహ్మ ఇతి'- అన్న శ్రుతి వచనాన్ని బట్టి ఏదైతే అమృతమో అది అభయస్థానం, అదే బ్రహ్మస్థానం అని తెలుసుకునే విజ్ఞత, మానసిక దృఢత్వం కలిగి ఉండాలి. అప్పుడే అతని వ్యక్తిత్వం ఉన్నతంగా ఎదుగుతుందని అర్జునుడికి శ్రీకృష్ణపరమాత్మ ఉపదేశించాడు.



- శ్యామ్ ప్రసాద్

**ఇస్లాం బోధ**

# అతిథి సత్కారం.. స్వర్గానికి మార్గం!



ఒకసారి ఓ గృహిణి ప్రవక్త (స) దగ్గరకొచ్చి 'నా భర్త రోజూ ఎవరో ఒక అతిథిని ఇంటికి తీసుకొస్తాడు. రోజూ వారికి వంటలు వండి, అతిథి మర్యాదలు చేసి అలసిపోతున్నాను' అని గోడు వెళ్లబోసుకుంది. ఈ మాటలకు ప్రవక్త (స) సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోవడంతో ఆమె అక్కణ్నుంచి వెళ్లిపోయింది. తరువాత ప్రవక్త ఆ గృహిణి భర్తను పిలిచి 'నేను ఈ రోజు మీ ఇంటికి అతిథిగా వస్తున్నాను' అని చెప్పడంతో అతను పొంగిపోయాడు. ఇంటికి వెళ్లి భార్యతో 'ఈ రోజు ప్రవక్త (స) మన ఇంటికి అతిథిగా వస్తున్నారు' అని సంతోషంగా చెప్పాడు. ఆ మాట విని ఆమె కూడా ఎంతో ఆనందించింది. భక్తిశ్రద్ధలతో రకరకాల వంటకాలు సిద్ధం చేసింది. ఇంతలో ప్రవక్త వారింటికి వచ్చారు. ఆయనకు సకల మర్యాదలు చేశారు. భోజనం ముగించుకొని తిరిగివెళ్తున్న ప్రవక్త (స) ఆ ఇంటి యజమానితో 'నేను వెళ్లే ద్వారం వైపు చూడమని నీ భార్యతో చెప్పు' అన్నారు. ఆ మేరకు ప్రవక్త (స) వెళ్తున్న వైపే ఆమె చూసింది. ఆయన వెనకాలే పాములు, తేళ్లు వంటి హానికర జీవాలు ఇంటినుంచి బయటికి వెళ్లడం కనిపించింది. ఆమెకు స్పృహ కోల్పోయినంత పనైంది. ఎందుకు ఇలా జరిగిందో తెలుసుకోవాలని ప్రవక్త (స) దగ్గరికి వచ్చిందామె. అదే విషయం అడిగింది. 'ఇంటికి వచ్చిన అతిథి వెళ్తూ వెళ్తూ ఆ ఇంట్లో వారి విపత్తులు, ఆపదలు, కష్టనష్టాలన్నీ తీసుకుని వెళ్లిపోతాడు. ఆ అతిథికి మంచి భోజనం వండటానికి చేసిన కష్టానికి ప్రతిఫలం ఇది' అని చెప్పారు. 'అల్లాహ్‌ను, పరలోక జీవితాన్ని నమ్మేవారు అతిథి మర్యాదలు చేయాలి. ఇంటికి వచ్చిన అతిథిని ఆపద అనుకోవద్దు. అతిథిని ఇంటికి శుభంగా భావించాలి. అతిథి సత్కార్యంలో మన మేలు దాగి ఉన్నది. ఏ ఇంటి ద్వారాలైతే అతిథుల కోసం తెరిచి ఉంటాయో.. ఆ ఇంటి వారి కోసం స్వర్గ ద్వారాలు తెరిచి ఉంటాయి. అతిథి సత్కారం స్వర్గానికి మార్గం' అనేవారు ప్రవక్త (స). హజ్రత్ అలీ (రజి) రోజూ ఎవరో ఒకరిని ఇంటికి భోజనానికి పిలిచేవారు. అతిథి దొరకని నాడు ఆ రోజు పస్తుండేవారు. ఇలా ప్రవక్త బోధనలు విన్న సహచరులు అతిథుల రాక కోసం నిరీక్షించేవారు. అంతేకాదు తమ ఇంట్లో అతిథుల కోసం ప్రత్యేక గదిని నిర్మించేవారు. దాన్ని మెహమాన్ ఖానా అని పిలుచుకునేవారు. ఇంటికి వచ్చిన అతిథిని నవ్వుతూ స్వాగతించడం, వెళ్లేటప్పుడు గడప దాకా వెళ్లి సాగనంపడం ప్రవక్త సంప్రదాయం.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076